మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

మంత్రి శ్రీధర్‌బాబుకు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరుకావాలని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా అవసరాలను తీర్చేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలును చేపడుతున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబును జూబ్లీహిల్స్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్, మణికొండ, నార్సింగి మున్సిపల్ నిధులతో పూర్తి చేసిన, చేయబోతున్న పనులకు ఈ నెల 6న పలు శంకుస్థాపనలు చేయడంతో పాటు ప్రారంభించేందుకు రావాలని ఆయన ఆహ్వానించారు.

నిరుద్యోగులకు ఉచిత డేటా

ఇంజినీరింగ్ కోర్సులు

ఖైరతాబాద్, జనవరి 29 : నిరుద్యోగ యువత కోసం శ్రీ సత్యసాయి సేవా సంస్థ డేటా ఇంజినీరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తోంది. అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, పవర్ ఇన్, సాఫ్ట్ స్కిల్స్‌లలో ఔత్సాహిక అభ్యర్థులకు శిక్షణ ఇస్తారు. 2021–24 మధ్య బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసిన వారు అర్హులు. అర్హత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామని, మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్‌ను సైతం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 905237 2023 నంబర్‌లో కాల్ చేయవచ్చని, తమ దరఖాస్తులను www.sethu.ai వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని కోరారు.

పేదలు ఉంటున్న బస్తీలపై అధికారుల చిన్నచూపు

–నెలరోజులుగా మురుగు ప్రవాహం
–ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బంజారాహిల్స్,జనవరి 29: పేదలు నివాసం ఉంటున్న బస్తీలంటే ప్రభుత్వ విభాగాలకు చిన్నచూపా.. కేవలం ప్రముఖులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లోనే అభివృద్ధి పనులు చేస్తూ పేదల బస్తీలను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారా.. అంటే అవును అనే సమాధానాలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బసవతారకం నగర్ బస్తీలో సుమారు నెలరోజులుగా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. కాలం చెల్లిన సీవరేజ్ లైన్లు మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కావడంతో బస్తీలో నిరంతరం మురుగు ప్రవాహం కొనసాగుతోంది. డ్రైనేజీలైన్లు మొత్తం పూడికతో నిండిపోవడంతో మురుగునీరు మొత్తం వరదలా రోడ్లపై పారుతోంది.

ఏడాదినుంచి ఈ సమస్య ఉన్నప్పటికీ ఇప్పటిదాకా పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జలమండలి అధికారులు తమ బస్తీలో పర్యటించి సీవరేజ్ లైన్ పనులు ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఫిలింనగర్‌లోని బసవతారకం నగర్ బస్తీలో రోడ్డుపై పారుతున్న మురుగునీటి ప్రవాహం

మణికొండ మున్సిపాలిటీ వాసవీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున అన్నదానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతుంది. ఈ క్రమంలో భాగంగా బుధవారం మౌని అమావాస్యను పురస్కరించుకుని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించామని అధ్యక్షుడు ఓలం యాదగిరి తెలిపారు.– మణికొండ, జనవరి 29

అమావాస్య రోజును పురస్కరించుకుని మణికొండ మాజీ వార్డుసభ్యురాలు సముద్రాల వాణిరమేశ్ ఆధ్వర్యంలో మణికొండ క్వార్టర్స్‌లోని పోచమ్మ దేవాలయంలో అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో కందాడ రాఘవరెడ్డి,దొడ్డి లక్ష్మణ్, శ్రీనివాస్, బొడ్డు శ్రీధర్,స్రవంతి, మోహన కృష్ణ, అందె లక్ష్మణ్‌రావు, సందీప్,బాబు పాల్గొన్నారు.

సీవరేజ్ సమస్యలు పరిష్కరించండి

జలమండలి అధికారులను కోరిన కార్పొరేటర్ వెంకటేశ్

నవ నిర్మాణనగర్‌లో స్థానికుల సమస్యల గురించి జలమండలి అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్,జనవరి 29: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 71లోని నవ నిర్మాణనగర్‌లో స్థానికులు ఎదుర్కొంటున్న సీవరేజ్ సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ జలమండలి అధికారులను కోరారు. బుధవారం బస్తీలో పర్యటించిన కార్పొరేటర్‌కు స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. స్థానికంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు మొత్తం పొంగిపొర్లుతోందని, కాలం చెల్లిన సీవరేజ్ లైన్‌ను మార్చాలని కోరారు. జలమండలి ఉన్నతాధికారులకు కార్పొరేటర్ ఫోన్ చేసి స్థానికుల సమస్యల గురించి వివరించారు. త్వరలో కొత్త లైన్‌ను వేయిస్తామని ఇతర సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాంబాబుతో పాటు స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

రేపు తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్ అసోయేషన్ ఎన్నికలు

బంజారాహిల్స్,జనవరి 29: తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్ అసోసియేషన్(ఏఏటీటీ) కార్యవర్గ ఎన్నికలు జనవరి 31న నిర్వహించనుండడంతో ప్రచారం తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఫిలించాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీఎస్.హరి ప్యానల్ సభ్యులు విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష అభ్యర్థి హరి మాట్లాడుతూ.. సినీ నటులుగా అనేక పాత్రలు పోషించి తమ కెరీర్ అయిపోయిందని బాధపడుతున్న తరుణంలో టెలివిజన్ రంగం సరికొత్త అవకాశాలు అందించిందన్నారు. టెలివిజన్ రంగంలో పనిచేస్తున్న నటీనటుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా తెలుగు టెలివిజన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అనేక కార్యక్రమాలు చేస్తోందని, ఇదే ఒరవడిని కొనసాగించేలా చూస్తామన్నారు. తమ ప్యానల్ భారీ విజయం సాధించడం ఖాయమని, ఆర్టిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తెలుగు సీరియల్‌లో ఇతర బాషకు చెంది నటీనటులను నియంత్రించడం, ఆరోగ్య బీమా పెంపు, టీవీ నగర్ నిర్మాణం, ప్రభుత్వం తరపున అవార్డులు తదితర లక్ష్యాలను చేరుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నటుడు విజయ్ యాదవ్, వినోద్ బాల, భార్గవ గొట్టికొండ, చెన్నుపాటి సుబ్బారావు, రాంజగన్, శశాంక్,కృష్ణకిశోర్, దీప్తి వాజ్‌పేయ్, దీప దుర్గంపూడి తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

హిమాయత్‌నగర్,జనవరి 29: ప్రజా యుద్ధనౌక స్వర్గీయ గద్దర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేం ద్ర, రాష్ట్ర కార్య నిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. శ్రీకాంత్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గద్దర్‌పై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం హిమాయత్‌నగర్‌లోని వై జంక్షన్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి,సమాజంను అవమానపరిచేలా బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు.ఈ కార్య క్రమంలో ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు ఆర్.బాలకృష్ణ,నేతలు మధు,శివ కుమార్, కల్యాణ్, అనిల్‌కుమార్, హేమంత్ కుమార్, అరుణ్, భగత్‌సింగ్,వీరేష్, భాను, సంజయ్,నాగేష్,శివకుమార్, వంశీ, గణేష్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫిబ్రవరి 2న రన్ ఫర్ ఎ గర్ల్స్

ఖైరతాబాద్, జనవరి 29: బాలికల సాధికారత కోసం సేవా భారతి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న గచ్చిబౌలి స్టేడియం వేదికగా 'రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్' 9వ ఎడిషన్ నిర్వహిస్తున్నామని సంస్థ ప్రధాన కార్యదర్శి జయప్రద తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 2030 నాటికి ఒక లక్ష మంది ఆడపిల్లల సాధికారత కోసం కృషి చేస్తున్నామని, అందులో భాగంగా రన్ ఫర్ ఎ గర్ల్ చైల్డ్ చేపడుతున్నామన్నారు. 20కే, 10కే, 5కే విభాగాల్లో నిర్వహించే రన్‌లో సుమారు పది వేల మంది పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం టీషర్టు, మెడల్స్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా భారతి ఉపాధ్యక్షురాలు డాక్టర్ సుమలత, బ్రాండ్ అంబాసిడర్ సరిత, ఫ్రీడం ఆయిల్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) చంద్రశేఖర్‌రెడ్డి, గ్లోబల్ డేటా డైరెక్టర్ స్వప్న, చేతన్, ప్రసన్న కాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు.ప్రైవేట్ పాఠశాలలను ఆదుకోవాలని కోరుతూ బంజా రాహిల్స్‌లోని గడ్డం ప్రసాద్ నివాసంలో బుధవారం ట్రస్మా ప్రతినిధులు కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా ట్రస్మా ఫౌండర్ కందాల పాపిరెడ్డి,రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ ఎన్‌రెడ్డిలు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలోని సమస్యలను పరిష్కరించి,కార్పొరేట్ స్కూళ్ల ఆగడాలను అరికట్టాలని కోరారు. అనంతరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి,సహాయ కార్యదర్శి బసవరాజ్,నగర ప్రధాన కార్యదర్శి జయరాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

కొత్తూరు మల్లేష్ మృతి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 29: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొత్తూరు మల్లేష్ బుధవారం సాయంత్రం కన్నుమూసారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలో నివాసం ఉంటున్నాడు. వారం రోజుల క్రితం శంషాబాద్‌లో పని నిమిత్తం బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. అప్పటి నుంచి శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ..బుధవారం సాయంత్రం ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చర్చిలోకి రాకుండా అడ్డుకోవడం అన్యాయం

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న పాస్టర్లు శాంసన్, జాన్ సుబ్బారెడ్డి తదితరులు

పాస్టర్లు కేఎం శాంసన్, జాన్ సుబ్బారెడ్డి

ఖైరతాబాద్, జనవరి 29 :హెబ్రోస్ చర్చి వివాదంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని పాస్టర్లు కేఎం శాంసన్, జాన్ సుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమను హెబ్రోస్ చర్చిలోకి రాకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డానియల్, కృపావరంతో కలిసి వారు మాట్లాడుతూ 1969 నుంచి తాము హెబ్రోస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం హెబ్రోస్‌ను కేవలం అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌గా మాత్రమే చూపుతున్నారని, కాంపౌండ్ గేటు వేసి.. భక్తజనులకు ప్రార్థన చేసుకునే అవకాశం కల్పించకపోవడం అన్యాయమన్నారు. అసలు హెబ్రోస్‌కు సంబంధం లేని కొందరు ప్రభుత్వానికి సంబంధించిన వారమని చెప్పి ఇటీవల హెబ్రోస్ తమదే అని ప్రకటించారన్నారు. సొసైటీ ట్రస్ట్ ఏకమై కార్యక్రమాలు జరుపుకొంటామంటే కూడా అడ్డుపడుతున్నారని, అలాంటి వారిపై ప్ర భుత్వం చర్యలు తీసుకొని తమకు న్యా యం చేయాలని కోరారు. ఈ విషయంలో విచారణ కోసం వీలైతే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని పాస్టర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

సర్వేల పేరుతో.. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పదోవ

బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్‌రావు

శంషాబాద్ రూరల్, జనవరి 29 : సర్వేల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఏడాది నుంచి ప్రజలను సర్వేల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని వివరించారు. దీంతో పాటు ఇటీవల ప్రకటించిన నాలుగు సంక్షేమ పథకాలలో లబ్ధిదారులను తగ్గించడం కోసం అనేక కొర్రీలు పెట్టి సంక్షేమ పథకాలు రాకుండా చేస్తున్నారని తెలిపారు. మండలంలో ఒక గ్రామంలో నాలుగు పథకాలు విజయవంతంగా అమలు చేస్తామని ప్రకటించి వాటిలో ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. నేటికి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 420 రోజులు పూర్తి అయిన సందర్భంగా 420 హామీలు అమలు చేయలేదని అందుకోసం నిరసనగా నేడు మహాత్మాగాంధీ విగ్రహాలకు వినతి పత్రం ఇవ్వాలని అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శంషాబాద్‌కు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ వర్సిటీకి తోడ్పాటునందిస్తాం

– స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

సమావేశంలో మాట్లాతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 29 : తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ రంగంలో పనిచేస్తున్న వారందరికీ గర్వకారణమని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ యూనివర్సిటీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు అనంతరం తెలంగాణలో సాగు, అనుబంధ రంగాలకు అధిక ప్రాధాన్యత పెరిగిందని, అందుకు అనుగుణంగా ఇతర శాఖల కన్నా, ఈ సారి వ్యవసాయానికి అధిక నిధులు దాదాపు రూ. 50 వేల కోట్లు కేటాయించామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. వ్యవసాయ కుటుంబం నుంచి రావడమే కాకుండా యూనివర్సిటీ తన సొంత జిల్లాలో ఉన్నందున ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నామని సూచించారు. వర్సిటీలో, కంది, వరి లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశ వ్యాప్తంగా గుర్తింపు తేవడం అభినంద నీయమన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఎర్ర, నల్లరేగడి, ఇసుక వంటి సారవంతమైన నేలలు, అందుకు అనుగుణంగా వాతావరణ పరిస్థితులు , మానవ వనరులు అధికంగా ఉన్నాయని గుర్తు చేశారు .అన్యాక్రాంతానికి గురైన వర్సిటీ భూములను వెనక్కి తీసుకోవడమే కాకుండా , వర్సిటీలో కనీస వసతులు, శాస్త్రవేత్తలు , బోధన , బోధనేతర సిబ్బంది సమస్యలన్ను సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అందరూ మనస్ఫూర్తిగా పనిచేసి వర్సిటీని దేశంలోనే మంచి పేరు తీసుకురావాని ఆయన ఆకాంక్షించారు.కార్యక్రమంలో వీసీ జానయ్య, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మొబైల్ చోరీ

బంజారాహిల్స్,జనవరి 29: కూరగాయలు కొనేందుకు ముందుకు ఒంగిన వ్యక్తి జేబులోంచి రెప్పపాటులో మొబైల్ కాజేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఫిలింనగర్ వివేకానందనగర్‌లో నివాసం ఉంటున్న కే.శ్రీను(40) వాటర్ క్యాన్లు సప్లై చేస్తుంటాడు. మంగళవారం రాత్రి ఫిలింనగర్‌లోని ఏబీఎన్ చౌరస్తాలో వారాంతపు సంతలో కూరగాయలు కొనేందుకు ముందుకు ఒంగిన సమయంలో పక్కనున్న ఓ అగంతకుడు అతడి మొహానికి అడ్డుగా న్యూస్ పేపర్ పెట్టుకొని మొబైల్ ఫోన్‌ను కొట్టేసి పారిపోయాడు. దీంతో అతడిని పట్టుకునేందుకు కొంతదూరం పరిగెత్తినా లాభం లేకపోయింది. ఈ మేరకు బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

31 నుంచి విశ్వేశ్వరయ్యభవన్‌లో

ఏఐపై జాతీయ సదస్సు

ఖైరతాబాద్ : ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్యభవన్‌లో ఈ నెల 31 నుంచి రెండు రోజుల పాటు 'ఏఐ డ్రివెన్ డిజిటల్ ట్విన్స్ ఇన్ మెకానికల్ అండ్ థర్మల్ ఇంజినీరింగ్ సిస్టిమ్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ది ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ డాక్టర్ జి. వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు సదస్సుకు ఇన్‌కంట్యాక్ కమిషనర్ కె. మేఘనాథ్ చౌహాన్, లీడ్స్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రభా శంకర్, రెండో రోజు జేఎన్‌టీయు మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజగోపాల్‌లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయండి

హైదర్‌గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న నేతలు

హిమాయత్‌నగర్,జనవరి 29: కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలని లేనిపక్షంలో ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం ఖాయమని తెలం గాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ హెచ్చరించారు.స్థానిక సంస్థలు, గ్రామ పంచాయితీ,మండల,జిల్లా పరిషత్, మున్సిపాలిటీల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ బుధవారం హైదర్ గూడలోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్సీ,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను సంఘం ప్రతినిధులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలన్నారు.ఎమ్మెల్సీ,గ్రాడ్యుయేట్స్,టీచర్ల ఎన్నికల్లో పోటీచేసేందుకు బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి టికెట్స్ కేటాయించాలని డిమాండ్ చేశారు.మహేష్‌కుమార్‌గౌడ్ సానుకూలంగా స్పం దించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గిరగాని భిక్షపతిగౌడ్,టీబీసీఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర శ్రీహరిగౌడ్,రాష్ట్ర కార్యదర్శి సత్యం,నేతలు మహేష్,రాకేష్‌యాదవ్,అభిషేక్ పటేల్,సలీం,లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కళాశాల, అంబిషన్స్ కెరీర్ కౌన్సెలర్స్, వాసవీ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో ఇంటర్మీడియేట్ విద్యార్థులకు కామర్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో కోమల్ మొదటి బహుమతి, వెంకట కావ్యలత ద్వితీయ బహుమతి, అయేషా తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కూర రఘువీర్, వైస్ ప్రిన్సిపాల్ తిరుమలరావు, వాసవీ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షులు ఎ. దయాకర్, అంబిషన్స్ కెరీర్ కౌన్సెలర్స్ వైస్ ప్రిన్సిపాల్ సంతోషి పాల్గొన్నారు. – ఖైరతాబాద్, జనవరి 29 :

కొట్టేసిన బైకులపై వచ్చి సెల్‌ఫోన్ల చోరీ

నిందితుల్లో ముగ్గురు మైనర్లే

ఖైరతాబాద్, జనవరి 29 : పార్కు చేసిన బైకులను కొట్టేస్తారు....తిరిగి ఆ వాహనాలపైనే వెళ్లి సెల్‌ఫోన్లు అపహరిస్తారు. దొంగతనం చేసిన సొత్తును ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ ఘరానా దొంగలను పంజాగుట్ట పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ మోహన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం....మల్లేపల్లి విజయ్ నగర్‌కాలనీకి చెందిన మహ్మద్ షేక్ ఒమెర్ (18) ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో మైనర్లతో ఓ ముఠాను ఏర్పాటు చేసుకున్నాడు. ఇండ్ల ముందు పార్క్ చేసి ఉన్న బైక్‌లను తస్కరించి అదే వాహనాలపై సంచరిస్తూ వెనుక వైపు నుంచి వచ్చి సెల్‌ఫోన్లను ఎత్తుకెళ్తున్నారు. సెల్‌ఫోన్లను జగదీశ్ మార్కెట్‌లో....బైకులను ఓఎల్ఎక్స్, ఇతర మార్గాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. డీపీ కాలనీలో ఓ డయాగ్నస్టిక్స్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్న ఓ మహిళ ఈ నెల 16న పంజాగుట్ట నుంచి అమీర్‌పేట వైపు ఫోన్‌లో మాట్లాడుకుంటూ వెళ్తుండగా, వెనుకవైపు నుంచి వచ్చిన దొంగలు వాటిని అపహరించుకెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు మహ్మద్ షేక్ ఒమర్‌తో పాటు ముగ్గురు బాల నేరస్తులను సైతం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 12 మొబైల్ ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఇప్పటికే పంజాగుట్ట, గచ్చిబౌలి, బంజారాహిల్స్, రాజేంద్రనగర్, కేపీహెచ్‌బీ కాలనీ, మాధాపూర్, చైతన్యపురి, ఫిల్మ్‌నగర్ పీఎస్ పరిధిలో మొత్తం తొమ్మిది కేసులు నమోదయ్యాయి. నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టి, బాల నేరస్తులను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

శంషాబాద్ పట్టణంలో.. పోలీసుల విస్తృత తనిఖీలు

నిషేధిత గుట్కాలు అమ్ముతున్న ఆరుగురు అరెస్టు

శంషాబాద్ రూరల్, జనవరి 29 : శంషాబాద్ పట్టణంలో బుధవారం సాయంత్రం పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి శంషాబాద్ పట్టణంలో ఉన్న లాడ్జిలు,పాన్‌షాపులు, బెల్ట్‌షాపులపై దాడులు చేయగా వాటిలో మధురానగర్ కాలనీలో ట్రేడ్ లైసెన్స్, సీసీటీవీ, జీఎస్టీ ,ఫైర్‌సేఫ్టీ లేని 4 లాడ్జిలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. దీంతో పాటు అక్రమంగా నిషేధిత గుట్కాలు అమ్ముతున్న పాన్‌షాపులపై దాడులు నిర్వహించి రూ. 30వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆరుగురిని అరెస్టు చేశామన్నారు. బెల్‌షాపులపై దాడులు నిర్వహించి 20 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోవడంతో పాటు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

ఖైరతాబాద్, జనవరి 28 :కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులు, అమర కళాకారుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ఉపాధ్యక్షురాలు అంజలి కోరారు. చింతలబస్తీలోని జేఏసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు రూ.30వేల పింఛన్, నాలుగు గదుల ఇండ్లు 250 గజాల స్థలంలో నిర్మించాలన్నారు.

నగరంలో పేదలు ఉన్న ప్రాంతంలో హైడ్రాను ఉపయోగించవద్దని కోరారు. గుర్తింపుకార్డులతో పాటు వారి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, చంద్రన్న ప్రసాద్, డోలక్ యాదగిరి, పెద్ద యాదగిరి, గంగిరాజు, రాజయ్య, శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ కౌన్సిలర్‌కు సన్మానం

ఐదు సంవత్సరాల పాటు వార్డు అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడిన మాజీ కౌన్సిలర్‌ను ఆ వార్డు ప్రజలు బుధవారం సన్మానించి అభినందించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు కౌన్సిలర్‌గా ఐదు సంవత్సరాలు కొనసాగిన గున్నాల అమరేందర్‌రెడ్డి ఖానాపూర్ గ్రామానికి గతం కంటే మెరుగైన అభివృద్ధిని సాధించి పెట్టారని ఆ గ్రామ ప్రజలు గుర్తు చేసుకున్నారు. గ్రామంలో అనేక అపరిష్కృత సమస్యలను పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాచర్ల రాజు, సింగిల్‌విండో డైరెక్టర్ రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ప్రదీప్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు. – మణికొండ

SUMMONS
IN THE HON'BLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE: VIJAYAWADA. O.S.NO. 149/2023
Between :-
Samineni Hanishvardhan ...Plaintiff
And
Samineni Rajeswari and others ...Defendants
To
D3: Samineni Somanath, S/o. late Srinivasa Satya Prasad, Hindu, aged about 31 years, resident of Plot No. 114/A, H.No. 8-3-1100/6, Flat No. 402, Nitya Enclave, Srinagar, Colony, Hyderabad. Ph: 9494871133.
The above named Plaintiff filed the above against the defendants for partition of the plaint schedule properties and said suit was posted to 04.02.2025 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above petition will be decided setting you exparte.
SCHEDULE:- Krishna District, Patamata Sub Registrar ilaka, Vijayawada Municipal Corporation area, Vijayawada Town, Labbipet in Mogalrajpuram, Ward No.10, Block No. 21, NTS No.511, Old assessment No. 6921, subsequent old Assessment No. 25979 F, New Assessment No. 216058, present Assessment No. 1073107624, Old Door No. 39-2-24,Present Door No. 39-2-20, an extent of 3347.27 sq.yards being bounded by : East : Property of others, South : property of Valluru Venkata Subba Rao,West : property of Garlapati Venkateswara Rao, North : Municipal Road In the above extent of 3347.27 sq. yards of site, the plaintiff and the 7th defendant have got an undivided and unspecified 1/6th share, i.e., 557.87 sq. yards or 466.46 sq. mt. of site and ground, first floor RCC daba and ACC constructions in the second floor therein, and in the said extent of 557.87 sq. yards and constructionstherein, the plaintiff has got undivided and unspecified half (1/2) share in 1/6th share i.e. 1/12 share.
(By Order of the Court)
Dt.27.01.2025, Vijayawada.
D.P.Rama Krishana, Advocate, Vijayawada.